RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

ప్రచురణ :తెలంగాణ , సంపుటి 01, సంచిక 04, సంపాదకులు :చెరుకు ఉపేందర్ , పేజీలు -4 మంగళవారం - 20 - ఆగష్టు - 2024 , వెల రూ.5/-

## లంకలో ఎన్నికల సందడి




చాన్నాళ్లుగా అందరూ ఎదురుచూస్తున్న శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. వచ్చే నెల 21న జరగబోతున్న ఎన్నికల్లో 39 మంది అభ్యర్థులు ఖరారయ్యారు. శ్రీలంక దివాలా తీసి ఎంతటి విపత్కర పరిస్థితులో చిక్కుకున్నదో అందరికీ తెలుసు. 2022లో అధ్యక్ష భవనంపై, పార్లమెంటుపై మిగతా..2లో



## వైద్యులు వీలైనంత త్వరగా విధుల్లోకి చేరండి.. సుప్రీంకోర్టు విజ్ఞప్తి



## హైదరాబాద్‌లో భారీ వర్షం...

హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వరదనీరు

2జూబ్లీహిల్స్, బేగంపేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం



## మంకీపాక్స్‌పై కేంద్ర ఆరోగ్యశాఖ అప్రమత్తం.. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

## నా మాటలు గుర్తుపెట్టుకో చీఫ్ మినిస్టర్.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ వార్నింగ్



హైదరాబాద్: తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు.





## ఒళ్లంతా 14 లోతైన గాయాలు, మర్మాంగాన్ని ఛిద్రం చేసి హత్య

- ఒళ్లు జలదరించేలా కోల్‌కత్తా డాక్టర్ అటాప్సీ రిపోర్ట్

## బీజేపీ,కాంగ్రెస్ తెలుగు రాష్ట్రాలలో

# ప్రాంతీయ పార్టీల మీద కన్ను


- రెండు జాతీయ పార్టీలు : రెండు ప్రాంతీయ పార్టీలను మింగేస్తాయా ...?
- దేశంలో పొలిటికల్ పోలరైజేషన్ సాగుతోంది
- తమిళనాడులో ద్రవిడ మున్నేట్ర కజగం పేరుతో ఇప్పటికి ఎనిమిది దశాబ్దాల క్రిత్రం ప్రాంతీయ రాజకీయం మొదలైంది






హైదరాబాద్: దేశంలో పొలిటికల్ పోలరైజేషన్ సాగుతోంది. అది సౌత్ నుంచే ఆరంభం అవుతోంది. ముఖ్యంగా సౌత్ ఒకనాడు ప్రాంతీయ పార్టీలకు పుట్టినిల్లు. తమిళనాడులో ద్రవిడ మున్నేట్ర కజగం పేరుతో ఇప్పటికి ఎనిమిది దశాబ్దాల క్రిత్రం ప్రాంతీయ రాజకీయం మొదలైంది. ఆతరువాత మరాఠాలో శివసేన ప్రాంతీయ పార్టీగా అవతరించి ఆరు దశాబ్దాలు అయింది. అలా ఉత్తర దక్షిణాదిలో ప్రాంతీయ పార్టీల హవా పెద్ద ఎత్తున సాగింది. ఇపుడు చూస్తే సీన్ రివర్స్ లో సాగుతోంది. ప్రాంతీయ పార్టీలను తగ్గించడం, వీలైతే తమతో కలిపేసుకోవడం ద్వారా పూర్తి రాజకీయ ఆధిపత్యం చలాయించాలని జాతీయ పార్టీలు చూస్తున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్ కి బీజేపీ ఏమీ తీసిపోవడం లేదు. పైగా నాలుగాకులు ఎక్కువ చదివింది కూడా. దాంతో బీజేపీ కాంగ్రెస్ ఇపుడు రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల మీద కన్నేశాయని అంటున్నారు. గత ఏడాది చివరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలు అయింది. ఈ ఏడాదిలో జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటూ సంపాదించలేకపోయింది. దాంతో బీఆర్ఎస్ విలీనం అంటూ గత కొన్ని నెలలుగా వార్తలు వస్తున్నాయి. మిగతా..2లో

## లేటరల్ ఎంట్రీ నియామకాలతో రిజర్వేషన్లను హరిస్తున్నారు : రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ : లేటరల్ ఎంట్రీ పద్ధతిలో కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు 45 మంది కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను నియమించేందుకు ఇటీవలే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ప్రైవేటు రంగ నిపుణులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో సేవలు అందిస్తున్న వారిని ఆయా పోస్టులకు ఎంపిక చేయనున్నారు. ఈ నియామక విధానంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలకు దేశ అత్యున్నత పదవుల్లో అవకాశం దక్కకుండా చేసేందుకు లేటరల్ ఎంట్రీ నియామక పద్ధతిని ఎన్డీయే సర్కారు వినియోగిస్తోందని ఆయన ఆరోపించారు. మిగతా..2లో

## శ్రీసిటీలో 8 వేల ఎకరాల్లో

# పారిశ్రామిక జోన్లు

### చంద్రబాబు శ్రీసిటీ సందర్శన!




శ్రీసిటీ :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం నాడు సూళ్ళూరుపేట దగ్గర వున్న శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతాన్ని సందర్శించారు. శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో పలు కంపెనీల సీఈవోలతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, ఈ సంపద సంక్షేమానికి దోహదం చేస్తుందని చెప్పారు. పారిశ్రామికవేత్తలు ఉపాధి, సంపద సృష్టిస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు."అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు చొరవతో 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయి. పెట్టుబడులు రాబట్టేందుకు పలు దేశాల్లో పర్యటించాను. ఐటీ పరిశ్రమ భారతదేశాన్ని ప్రపంచ పటంలో నిలుపుతుందని ఆనాడే చెప్పాను. గతంలో ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ విధానంలో హైటెక్ సిటీ చేపట్టాను. ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒక భారతీయుడు ఉంటారు. ఇందులోని ప్రతి నలుగురిలో ఒక ఏపీ వ్యక్తి ఉంటారు. శ్రీసిటీలో 8 వేల ఎకరాల్లో పారిశ్రామిక జోన్లు ఏర్పాటయ్యాయి. సెజ్, డొమెస్టిక్ జోన్, ఫ్రీట్రేడ్ జోన్లు వచ్చాయి. 220 కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ అవకాశం ఉంది. ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ పరిశ్రమలు వచ్చాయి. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటయ్యాయి. 4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 4 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించడం చాలా గొప్ప విషయం" అని చంద్రబాబు అన్నారు. "చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు శ్రీసిటీ దగ్గరగా వున్న శ్రీసిటీని అత్యుత్తమ ఎకనమిక్ జోన్‌గా తయారు చేయాలనేది తన ఆలోచన అని చంద్రబాబు చెప్పారు."శ్రీసిటీకి ఐ.జి.బి.సి. మిగతా..2లో

## ఉత్తరాంధ్రపై జగన్ రాజకీయం నడవదనీ పరిశీలకులు


పదవిలోకి బొత్స.. జగన్ చేతికి బొచ్చె!



విశాఖపట్నం :బొత్స సత్యనారాయణ విశాఖ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ కావడం ఇక లాంఛనమే. తెలుగుదేశం పోటీ నుంచి తప్పుకోవడంతో బొత్సకు లైన్ క్లియర్ అయ్యింది. అంత వరకూ ఓకే కానీ.. బొత్స ఎమ్మెల్సీ కావడం వైసీపీకి మాత్రం తీరని నష్టమే అన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఆ ప్రచారం చేస్తున్నది వైసీపీ ఉత్తరాంధ్ర నేతలూ, శ్రేణులే కావడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇంతకీ బొత్సకు జగన్ విశాఖ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడం, ఇంతకాలం అంటే జగన్ అధికారంలో ఉన్నంత కాలం విశాఖలో చక్రం తిప్పిన నేతలకు ఇసుమంతైనా ఇష్టం లేదు. అయితే తెలుగుదేశం మిగతా..2లో

## కూటమి ప్రభుత్వం

# క్లారిటీ ఇవ్వాలి




### పథకాల ఎఫెక్ట్.. కూటమిపై ప్రజలు అసంతృప్తా..?

అమరావతి: ప్రజల గవర్నమెంట్ అంటే.. ప్రజల భాగస్వామ్యం. కోట్లాదిమంది ప్రజలకు సంబంధించి నటువంటి అంశము.. వాళ్లతో ముడిపడి ఉన్నటువంటి అంశమే. వాళ్లకి కీలకమైనటువంటి అంశం. ప్రజలను కన్విన్ చేయాలి కన్ఫ్యూజ్ చేయకూడదు. ఇందులో వినొచ్చు వినకపోవచ్చు ప్రజలు.. కానీ ఇప్పటికిప్పుడు ప్రభుత్వాన్ని అయితే కూల్చలేరు.. ఉదాహరణకు కూటమి ప్రభుత్వం 50 ఏళ్లకే పెన్షన్ బీసీ,ఎస్సీ,ఎస్టీ , మైనారిటీ ఎప్పటినుంచి మిగతా..2లో



## రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామన్న కేటీఆర్‌పై రేవంత్ రెడ్డి మండిపాటు!

- అధికారం పోయినా బీఆర్ఎస్ నేతలకు అహంకారం తగ్గలేదని విమర్శ
- అనవసర ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం బహిష్కరిస్తుందని హెచ్చరిక
- డిసెంబర్ 9 లోపు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ

## పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖపై

# సీఎం చంద్రబాబు సమీక్ష...



- హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- సచివాలయంలో సమీక్ష సమావేశం
- పంచాయతీలకు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వ్యయం పెంపు
- గ్రామీణ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక యాప్
- ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు సీఎంకు వివరించిన పవన్

అమరావతి: సీఎం చంద్రబాబు నేడు పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖపై సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్ష సమావేశానికి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీలకు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల వ్యయం పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. వేడుకల వ్యయాన్ని రూ.10 వేల నుంచి 25 వేలకు పెంచినట్టు సమీక్షలో వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రత్యేక మొబైల్ యాప్ తీసుకువచ్చారు. మొబైల్ యాప్ రూపొందించి, గ్రామీణ పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షిస్తున్నట్టు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మిగతా..2లో

# బీజేపీ,కాంగ్రెస్ తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల మీద కన్ను

మొదటి పేజి తరువాయి

మేము విలీనం కాము మొర్రో అని ఆ పార్టీ నేతలు మొత్తుకుంటున్నా ఈ వార్తలు ఆగడం లేదు. కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం అని బీజేపీ వారు అంటూంటే లేదు బీజేపీలోనే బీఆర్ఎస్ విలీనం అని కాంగ్రెస్ పెద్దలు గట్టిగా బల్లగుద్ది మరీ చెబుతున్నారు. ఇంతకీ బీఆర్ఎస్ విలీనం ఏ పార్టీతో అన్న డౌట్లు అయితే తెలంగాణా జనాలలో వస్తున్నాయి. మొత్తానికి బీఆర్ఎస్ ని విలీనం పేరుతో రాజకీయంగా ఇబ్బంది పెట్టేస్తున్నారు. ఇపుడు ఏపీలో కూడా వైసీపీకి ఇదే రకమైన పరిస్థితి ఉంది అని అంటున్నారు. బీజేపీలో వైసీపీ విలీనాన్ని మేము వ్యతిరేకిస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు కీలక ప్రకటన చేశారు. బీజేపీలో వైసీపీ విలీనం అన్నది ఎవరికీ ఊహకు కూడా అందని విషయం. కానీ బీజేపీ ఎమ్మెల్యే చెప్పారు కాబట్టి దీని మీద అంతా చర్చిస్తున్నారు. మరో వైపు చూస్తే కాంగ్రెస్ లో వైసీపీ విలీనం అవుతుంది అన్న పుకారులు ఉన్నాయి. ఈ విషయంలో తెర వెనక చర్చలు జరుగుతున్నాయని కూడా అంటున్నారు. ఇవన్నీ ప్రచారంలో ఉన్న మాటలే. అయితే వీటిలో నిజం ఎంత అన్నది తెలియకపోయినా ఈ ప్రచారంతో వైసీపీతో పాటు ఏపీ ప్రజలలో వివిధ రాజకీయ పార్టీలలో చర్చ సాగుతోంది. నిజానికి ఓటములు గెలుపులు అన్నవి రాజకీయ పార్టీలకు సాధారణం. ఒక ఎన్నికల్లో ఓటమి చెందితే మరో ఎన్నికల్లో గెలిచి తీరుతారు. ఆ విశ్వాసం కూడా అధినేతలకు ఉంటుంది. అయితే 2014 నుంచి 2019 దాకా విపక్షంలోనే వైసీపీ ఉంది. మరి అలాంటి పార్టీకి అపుడు లేని రాని విలీన ప్రచారం ఇపుడు రావడం అంటే చిత్రమే అని అంటున్నారు. అలాగే కేసీఅర్ అంటేనే పోరాట యోధుడు. తెలంగాణా రాష్ట్రం అన్న కలను ఆయన సాకారం చేశారు. పదేళ్ల పాటు అధికారం చలాయించారు. అపర చాణక్యుడు అని పేరు. కొట్టేసిన సుప్రీం



అలాంటి కేసీఆర్ పార్టీకి పాతికేళ్ల పాటు నడిపి ఇపుడు విలీనం వైపు వెళ్తారా అన్నది కూడా అందరికీ కలిగే డౌట్. ఇక జగన్ అయినా కేసీఆర్ అయినా ఏటికి ఎదురీదే రకాలు. పట్టుదలకు మారు పేరుగా చెబుతారు. ఏమైనా కానీ తమ నిర్ణయాలను మార్చుకోకుండా ముందుకు సాగే తెగింపు ఉన్న నేతలు. బీఆర్ఎస్ లో కేటీఆర్ హరీష్ రావు కీలక నేతలుగా కేసీఆర్ కి బాసటగా ఉన్నారు. వైసీపీలో జగన్ ఇంకా యువ నాయకుడిగానే ఉన్నారు. మరింత కాలం పాటు రాజకీయం చేసే నేర్పూ ఓర్పూ ఆయనకు ఉన్నాయి. అయినా ఈ విలీనాల ప్రచారం దేనికి అంటే జాతీయ పార్టీలు బలోపేతం కావడం కోసం ప్రాంతీయ పార్టీలను మింగేయాలని చూస్తున్నాయా అన్న ప్రచారం కూడా ఉంది. చూడాలి మరి ఈ ప్రచారాలే నిజం అవుతాయా లేక ఈ పార్టీల ఆలోచనలు ఏ కొత్త రూపు తీసుకుంటాయన్నది.

# ఉత్తరాంధ్రపై జగన్ రాజకీయం నడవదనీ పరిశీలకులు

మొదటి పేజి తరువాయి

అయితే తెలుగుదేశం కూడా పోటీ చేస్తుంది. అధికారంలో ఉండటం వల్లనో, ప్రజా వ్యతిరేకత కారణంగా పెద్ద సంఖ్యలో స్థానిక సంస్థలలో వైసీపీ ప్రజా ప్రతినిథులుగా ఉన్న వారు గోడ దూకేసీ కూటమికి మద్దతు పలుకుతారన్న భావనతో వారు బొత్స ఓటమి తథ్యమని భావించారు. ఆ కారణంగానే ఉత్తరాంధ్ర జిల్లాల వైసీపీ ఇన్ చార్జ్ వైవీ సుబ్బారెడ్డి వంటి వారు బొత్స నామినేషన్ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విశాఖ నుంచి కంటే బొత్స సొంత జిల్లా విజయనగరం నుంచే ఎక్కువ మంది హాజరయ్యారు. దీనిని బట్టే విశాఖలో బొత్స ఎంట్రీని ఆ జిల్లా వాసులు ఎంతగా వ్యతిరేకిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.అయితే ఇప్పడనే కాదు.. ఎన్నికలకు ముందు కూడా జగన్ బొత్సను నమ్మారు కానీ విశాఖ వైసీపీ నేతలను పెద్దగా నమ్మలేదు. అందుకే విశాఖ ఎంపీ స్థానానికి బొత్ సతీమణినే నిలబెట్టారు. ఆమె ఘోరంగా ఓడిపోయారనుకోండి అది వేరే విషయం. కానీ బొత్స సతీమణిని విశాఖ ఎంపీగా నిలబెట్టడం ద్వారా జగన్ బొత్స సత్యనారాయణ తన అధికార, వ్యాపార సామ్రాజ్యాన్ని విశాఖకు, అలాగే శ్రీకాకుళం జిల్లాకు విస్తరించుకునేందుకు జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారనే చెప్పొచ్చు. ఎందుకంటే ఎన్నికలలో గెలుపు ఓటములతో సంబంధం లేకుండా బొత్స రాజకీయంగా, వ్యాపారాల పరంగా విజయనగరం జిల్లాలో పాతుకు పోయారు. ఇసుక, క్వారీలు, మద్యం, రియల్ ఇలా ఏ రంగం తీసుకున్నా బొత్స కుటుంబానిదే మొత్తం ఆధిపత్యం. ఇక రాజకీయంగా ఆయన జిల్లాలో బొత్స ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వైఎస్ హయాం నుంచీ కూడా బొత్స హవా విజయనగరం జిల్లాలో నడుస్తూనే ఉంది. రాష్ట్ర విభజన తరువాత జరిగిన తొలి ఎన్నికలలోనూ, ఆ తరువాత ఇటీవల జరిగిన ఎన్నికలలో మాత్రమే బొత్స, ఆయన కుటుంబ సభ్యులు పరాజయం పాలయ్యారు.విజయనగరం జిల్లాలో అంతగా పాతుకు పోయిన బొత్స విశాఖలోపై కూడా ఆధిపత్యం చెలాయించే అవకాశాన్ని జగన్ ఇచ్చారు. అందుకే లోక్‌సభ ఎన్నికలలో ఆయన సతీమణిని విశాఖ రప్పించి పోటీ చేయించారు. కానీ గాలివాటం మారడంతో ఆమె ఓడిపోయారు. సరే విశాఖ జిల్లాలో వైసీపీకి ఇటీవలి ఎన్నికలలో జీరో రిజల్టే వచ్చింది. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సహా వైసీపీ నుంచి పోటీ చేసిన వారంతా పరాజయం పాలయ్యారు. అయినా వారికి ఉన్న రాజకీయ నేపథ్యం కారణంగా విశాఖ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ కోసం పోటీ పడ్డారు. జగన్ బొత్సను ప్రమోట్ చేయడాన్ని వ్యతిరేకించారు. పోటీ అంటూ జరిగితే సహాయ నిరాకరణకు కూడా రెడీ అయ్యారు. అయితే అనూహ్యంగా తెలుగుదేశం కూటమి పోటీ నుంచి తప్పుకోవడంతో బొత్స ఎన్నిక ఏకగ్రీవం అయిపోయింది.బొత్సకు విజయం ఎలా దక్కిందన్నది పక్కన పెడితే ఇప్పుడు శ్రీకాకుళం, విజయగనరం, విశాఖ జిల్లాలపై బొత్స ప్రభావం, పెత్తనం కచ్చితంగా ఉంటుంది. అంటే ఉత్తరాంధ్ర వైసీపీకి ఇప్పుడు ముఖచిత్రంగా బొత్స మారిపోయారు. బొత్సకు ఎమ్మెల్సీ ఇవ్వడం ద్వారా వచ్చే ఎన్నికల నాటికి ఉత్తరాంధ్రలో వైసీపీ బలోపేతం అన్న బాధ్యతను జగన్ బొత్సకు అప్పగించారు. అయితే రాష్ట్ర రాజకీయాలలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులను బట్టి చూస్తే జగన్ తన పార్టీని అంత కాలం ఎలాంటి పొత్తులూ లేకుండా నడిపే అవకాశం ఇసుమంతైనా లేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే జగన్ కాంగ్రెస్ కు దగ్గరకావడానికి డిస్పరేట్ గా ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలిస్తే బొత్సకు కాంగ్రెస్ నాయకులతో ఉన్న పరిచయాల ద్వారా జగన్ ను అధిగమించి సొంతంగా నిర్ణయాలు తీసుకోవడానికే ఎక్కువ అవకాశలు ఉన్నాయని రాజకీయవర్గాలలో జోరుగా చర్చ జరుగుతోంది.వైసీపీ కాంగ్రెస్ లో విలీనమైనా, ఆ పార్టీతో పొత్తు పెట్టుకుని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నాలు చేసినా బొత్స రాజకీయ నిర్ణయం తీసుకునే అవకాశాలే మెండుగా ఉన్నాయని అంటున్నారు. తన విధేయత జగన్ పట్ల కాదనీ, వైఎస్ పట్ల అనీ ప్రకటించి బొత్స షర్మిల పంచన చేరినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదంటున్నారు. ఒక విధంగా విశాఖ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో జగన్ బొత్సకు పార్టీ టికెట్ ఇవ్వడం ద్వారా ఉత్తరాంధ్రలో పార్టీ మొత్తాన్ని పువ్వుల్లో పెట్టి బొత్సకు అప్పగించారనీ, ఇక ఉత్తరాంధ్రపై జగన్ రాజకీయం నడవదనీ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## అది పేలిందంటే, మీ ఇళ్ళతోపాటు మీరూ పోతారు”

ఐర్లాండ్ ,ఇంటర్‌నెట్ డెస్క్ :ఉత్తర ఐర్లాండ్‌లోని కౌంటీ డౌన్ ప్రాంతంలో వున్న న్యూ టౌనార్డ్స్ పట్టణంలో ఒక పెద్దమనిషికి టౌన్ మధ్యలో ఒక స్థలం వుంది. ఆ స్థలంలో తన డ్రీమ్ హోమ్ నిర్మించుకోవాలని ఆ పెద్దమనిషి అనుకున్నాడు. అనుకున్న వెంటనే ఆ స్థలాన్ని భవన నిర్మాణం కోసం చదును చేయడం ప్రారంభించాడు. ఇంతలో భూమిలోనుంచి ఒక పెద్ద ఇనప వస్తువు బయటపడింది. ఈ వస్తువు ఏంటా అని ఆ వ్యక్తి దాన్ని పగులగొట్టి తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ వుండగా, ఆ వస్తువుని మిలట్రీలో పనిచేసి రిటైరైన ఒక సీనియర్ సిటిజన్ చూసి కెవ్వుమని అరిచాడు. దాన్ని పగలగొట్టకంద్రా బాబూ అని అరిచాడు. ఆ తర్వాత అందరికీ అర్థమైన విషయం ఏమిటంటే, ఆ వస్తువు మరేదో కాదు.. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా పేలకుండా భూమిలో మిగిలిపోయిన బాంబు.పొరపాటున ఆ బాంబుని ఆ స్థలం ఓనర్ పగలగొట్టినట్టయితే ఆ టౌన్‌లో సగం భస్మీపటలం అయిపోయి వుండేది. స్థలం ఓనర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడకి వచ్చారు. భూమిలోంచి బయటపడింది రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి పేలని బాంబు అని కన్ఫమ్ చేశారు. దానిని పగలగొట్టడం కాదు.. కదిల్చినా పేలిపోయే అవకాశం వుంది కాబట్టి, ముందుగా దాన్ని జాగ్రత్తగా నిర్వీర్యం చేసిన తర్వాతే అక్కడ నుంచి తొలగించాలని నిర్ణయించారు. దీని కోసం ఆ బాబుకు చుట్టుపక్కల 4 వందల మీటర్ల చుట్టుకొలతలో వున్న ఇళ్ళన్నిటినీ ఖాళీ చేయించి వాళ్ళని పునరావాస కేంద్రాలకి తరలించారు. ఇళ్ళ ఓనర్లు కొంతమంది మా ఇల్లు వదిలిపెట్టి మేం వెళ్ళం అని భీష్మించుకుని కూర్చున్నారు. అప్పుడు పోలీసులు.. “మీ మొహాలు మండ.. బాంబుని నిర్వీర్యం చేసే ప్రయత్నంలో వుండగా అది పేలిందంటే, మీ ఇళ్ళతోపాటు మీరూ పోతారు” అని చెప్పి వాళ్ళని నయానో భయానో ఒప్పించి తరలించారు. ఇంకా బాంబుని నిర్వీర్యం చేయలేదు. సేఫ్‌గా చేస్తారని ఆశిద్దాం.

## ఒళ్లంతా 14 లోతైన గాయాలు మర్మాంగాన్ని ఛిద్రం చేసి హత్య

కలకత్తా : కోల్‌కత్తా ట్రైనీ డాక్టర్ నరకయాతన అనుభవించి చనిపోయిందని అటాప్సీ రిపోర్ట్ స్పష్టం చేసింది. ఆగస్టు 9వ తేదీన ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో హత్యాచారానికి గురైంది. చనిపోయే ముందు ఆమెని ఎన్ని చిత్రహింసలకు గురి చేశారని రిపోర్ట్ తేల్చి చెప్పింది. శరీరమంతా లోతైన గాయాలయ్యాయి. ఇప్పటికే పోస్ట్‌మార్టం రిపోర్ట్‌పై చర్చ జరుగుతుండగా ఇప్పుడు మరి కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గొంతు పిసికి ఊపిరాడకుండా చేసి చంపినట్టు నివేదికలో తేలింది. అంతే కాదు. అత్యంత దారుణంగా బలవంతం చేసి మర్మాంగానికి గాయమయ్యేలా పాశవికంగా ప్రవర్తించినట్టు రిపోర్ట్ వెల్లడించింది.ఈ నివేదిక ప్రకారం శరీరం మొత్తం మీద 14 గాయాలయ్యాయి. ముఖం, తల, మెడ, చేతులు, ప్రైవేట్ పార్ట్స్..ఇలా అన్ని చోట్లా గాయాలు కనిపించాయి. బలవంతంగా గొంతు నులిమి విలవిలలాడి ప్రాణాలు కోల్పోయేలా చేసినట్టు నివేదికలో వెల్లడైంది. ఇది కచ్చితంగా హత్యేనని స్పష్టం చేసింది. ఊపిరితిత్తుల నుంచి తీవ్ర రక్తస్రావమైందని, పలు చోట్ల రక్తం గడ్డ కట్టుకుపోయిందని రిపోర్ట్ పేర్కొంది. అయితే..ఎక్కడా ఫ్రాక్చర్స్ కాలేదని వెల్లడించింది. బ్లడ్‌తో పాటు శరీరంలో గుర్తించిన ఇతరత్రా ఫ్లూయిడ్ శాంపిల్స్‌ని అనాలసిస్‌కి పంపించారు.


సీబీఐ విచారణ..

ఆగస్టు 9వ తేదీన ఈ దారుణంగా జరగ్గా ఇప్పటి వరకూ కేసులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. హైకోర్టు ఈ కేసు విచారణను సీబీఐకి బదిలీ చేసింది. అన్ని కోణాల్లోనూ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. కాలేజ్ మాజీ ప్రిన్సిపల్‌నీ విచారిస్తున్నారు. బాధితురాలి తల్లిదండ్రులు న్యాయం జరుగుతున్న నమ్మకంతో ఉన్నారు. అటు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఘటనకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. దీనిపైనా రాజకీయంగా దుమారం రేగుతోంది. ముఖ్యమంత్రే ఇలా ర్యాలీ చేయడమేంటని మండి పడుతున్నారంతా. బెంగాల్‌కి హోం మంత్రి కూడా దీదీయే.

దీదీపై విమర్శలు..

ఇలాంటి దారుణాలు జరగకుండా శాంతి భద్రతల్ని కాపాడాల్సింది పోయి...ఇలా అందరిలా ర్యాలీ ఎందుకు చేసినట్టు అని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఈ కేసుని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. త్వరలోనే విచారణ చేపట్టనుంది. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసుని విచారించనుంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఈ ఘటనను నిరసిస్తూ 24 గంటల పాటు ఆందోళనలు చేశారు. వైద్య సేవలను బహిష్కరించారు. వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ కొన్ని చోట్ల ఈ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి.

## నేడు భారత్ బంద్



న్యూఢిల్లీ :ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ 21న భారత్ బంద్‌కు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. సుప్రీం కోర్టు తీర్పు వల్ల తమ హక్కులకు భంగం వాటిల్లుతోందని సమితి సభ్యులు వాపోతున్నారు.రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్న ఈ తీర్పును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్లుండి జరిగే బంద్‌లో ఎస్సీ,ఎస్టీ సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి, మహిళలు పాల్గొనాలని కోరారు.ఆగస్టు 1న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ సమర్థనీయమని తెలిపింది. ఎస్సీలు చాలా వెనుకబడిన వర్గాలుగా ఉన్నట్లు ఆధారాలున్నాయని.. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వర్గీకరణ ఆవశ్యకత ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. కొన్ని కులాల్లో వర్గీకరణ చేసే చేసే వెసులుబాటు రాష్ట్రాలకు ఉండాలని ఎస్సీ వర్గీకరణపై చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ, ఎస్టీ వర్గీకర అవసరమని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తితో తీర్పు వెలువరించింది.

## వైద్యులు వీలైనంత త్వరగా విధుల్లోకి చేరండి.. సుప్రీంకోర్టు విజ్ఞప్తి

హైదరాబాద్: కోల్‌కతాలో జరిగిన ట్రైనీ డాక్టర్ అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ గత 10 రోజులుగా వైద్యులు దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. వైద్యుల నిరసనతో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యులు సమ్మెను విరమించి తమ విధుల్లోకి చేరాలని దేశ అత్యున్నత న్యాయస్థానం కోరింది. ట్రైనీ వైద్యురాలి హత్యాచార కేసును సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారిస్తున్న విషయం తెలిసిందే. ఆ బెంచ్‌లో జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలు ఉన్నారు. విచారణ సందర్భంగా జూనియర్, సీనియర్ డాక్టర్ల భద్రతపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, డాక్టర్ల సమ్మెతో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ మేరకు వైద్యులు వెంటనే సమ్మె విరమించి తమ విధుల్లోకి చేరాలని కోరింది. ‘వైద్యులందరి భద్రత, సంక్షేమానికి సంబంధించిన విషయాలను కోర్టు పరిశీలిస్తున్నందున.. ప్రస్తుతం విధులకు దూరంగా ఉన్న వైద్యులు వీలైనంత త్వరగా తిరిగి విధుల్లోకి చేరాలని మేము కోరుతున్నాము’ అని సుప్రీం ధర్మాసనం తెలిపింది.

వైద్యుల భద్రతకై జాతీయ టాస్క్ ఫోర్స్..

మరోవైపు ఈ ఘటన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు ఓ జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. డాక్టర్ల భద్రత గురించి టాస్క్ ఫోర్స్ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మెడికల్ ప్రొఫెషనల్స్ ఎవరైనా సరే.. వారికి సామాజిక భద్రత కల్పించడమే ఆ టాస్క్ ఫోర్స్ ఉద్దేశంగా పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా డాక్టర్ల భద్రత గురించి ఏకాభిప్రాయాన్ని క్రియేట్ చేయాలని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ బృందంలోని సభ్యుల పేర్లను కూడా సుప్రీం వెల్లడించింది. జాతీయ టాస్క్ ఫోర్స్ బృందం జాబితా: సర్జర్ వైస్ అడ్మిరల్ ఆర్ సరిన్, డాక్టర్ డీ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎం శ్రీనివాస్ , డాక్టర్ ప్రతిమా మూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్ పురి, డాక్టర్ సౌమిత్ర రావత్, ప్రొఫెసర్ అనితా సక్సేనా(ఎయిమ్స్ కార్డియాలజిస్ట్), ప్రొఫెసర్ పల్లవి సప్రే (ముంబై గ్రాంట్ కాలేజీ డీన్), డాక్టర్ పద్మ శ్రీవాత్సవ్ (ఎయిమ్స్ న్యూరాలజీ) ఉన్నారు. వీరితో పాటు భారత ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటరీ, కేంద్ర ప్రభుత్వం హోం కార్యదర్శి, కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, జాతీయ మెడికల్ కమీషన్ చైర్‌పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్ ప్రెసిడెంట్ ఆ జాబితాలో ఉన్నారు.

## మంకీపాక్స్‌పై కేంద్ర ఆరోగ్యశాఖ అప్రమత్తం.. సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

ఢిల్లీ: మంకీపాక్స్ ప్రపంచదేశాలను వణికిస్తున్నది. ఆఫ్రికా దేశాల్లో పెద్ద ఎత్తున కేసులు నమోదవుతున్న విషయం తెలిసిందే. రోజు రోజుకు మంకీపాక్స్ పలు దేశాలకు సైతం విస్తరిస్తున్నది. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ మెడికల్ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. మంకీపాక్స్‌పై భారత ప్రభుత్వం సైతం అప్రమత్తమైంది. వైరస్‌ను ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన దవాఖానాల్లో బెడ్‌లను రిజర్వ్ చేయడంతో పాటు ప్రధాన ల్యాబ్‌లను సైతం అప్రమత్తం చేసింది. వ్యాధి నిర్ధారణకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో రోగులకు ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేసింది. చికిత్స చేయడంతో పరిశీలనలో ఉంచనున్నారు. ఢిల్లీ పరిధిలో పాజిటివ్ కేసులు నమోదైతే.. సదరు రోగులను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్పించనున్నారు. అలాగే, ఆల్ ఇంఇయా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (%ూ××మీా%)లో ఐదు పడకలను రిజర్వ్ చేశారు. ఆసుపత్రిలో చేరిన రోగుల్లో ఎవరికైనా మంకీపాక్స్ లక్షణాలు కనిపించినా.. మంకీపాక్స్ అనుమానిత కేసులు వచ్చినా వారిని ఆసుపత్రిలోనే ఏర్పాటు చేసిన బెడ్‌పై ఉంచి చికిత్స అందిస్తారు. ఢిల్లీలోని ఎయిమ్స్, రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, లేడీ హార్డింగ్ మెడికల్ హాస్పిల్స్‌ను మంకీపాక్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ అధికారులు కోరారు. అలాగే, వైరస్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్రాల్లోని ఆసుపత్రులకు అవసరమైన మార్గదర్శకాలను సైతం కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ జారీ చేసింది.

## శ్రీసిటీలో 8 వేల ఎకరాల్లో పారిశ్రామిక జోన్లు

మొదటి పేజి తరువాయి

‘శ్రీసిటీకి ఐ.జి.బి.సి. గోల్డెన్ రేటింగ్ గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నాం. పచ్చదనం కోసం వందశాతం వర్షం నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. శ్రీసిటీకి అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మారుస్తాం. సహజంగా చల్లనివాతారవణం కల్పనకు చర్యలు తీసుకుంటాం. వీలైనంత వరకు ఉత్పత్తి, లాజిస్టిక్ ధరలు తగ్గించుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వం కూడా చర్యలు చేపడుతుంది. కొత్త రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నాం. ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారు. పరిశ్రమలు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని కోరుతున్నా. 2029 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది. విజన్ 2047 ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. 2047 నాటికి ఒకటి లేదా రెండు స్థానాల్లో భారత్ నిలుస్తుంది” అని చంద్రబాబు అన్నారు.

## లేటరల్ ఎంట్రీ నియామకాలతో రిజర్వేషన్లను హరిస్తున్నారు : రాహుల్‌గాంధీ

మొదటి పేజి తరువాయి

ఒకవేళ అందుబాటులో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారులనే ఆయా పోస్టులలో నియమిస్తే.. ఎంతోమంది అణగారిన వర్గాల ఆఫీసర్లకు గొప్ప అవకాశాలు లభిస్తాయని రాహుల్ గాంధీ చెప్పారు. దేశంలోని ఉన్నతోద్యోగాలను దొడ్డిదారిన ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్నవారికి అప్పగించేందుకు లేటరల్ ఎంట్రీ రిక్రూట్‌మెంట్ పద్ధతిని మోడీ సర్కారు తెరపైకి తెచ్చిందని ఆయన మండిపడ్డారు. రామరాజ్యం పేరుతో రాజ్యాంగ విధ్వంసానికి బీజేపీ తెగబడిందన్నారు. దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు అవకాశాలు దక్కాలనేదే కాంగ్రెస్ డిమాండ్ అని పేర్కొన్నారు. ఇక రాహుల్ గాంధీ ఆరోపణలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తోసిపుచ్చారు. లేటరల్ ఎంట్రీ నియామక విధానంలోనూ రిజర్వేషన్లను పాటిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఎన్డీయే సర్కారు 2020లో ఓ మెమోను జారీ చేసిందన్నారు. ఆ మెమోతో ముడిపడిన వివరాలతో ఎక్స్ వేదికగా అశ్వినీ వైష్ణవ్ ఒక పోస్ట్ చేశారు. గతంలో యూపీఏ ప్రభుత్వమే లేటరల్ ఎంట్రీ విధానాన్ని పరిచయం చేసిందని ఆయన తెలిపారు. 2005 సంవత్సరంలో వీరప్ప మొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో ఎస్సార్సీ సైతం లేటరల్ ఎంట్రీ విధానానికి అనుకూలంగా అభిప్రాయాన్ని తెలిపిందని గుర్తు చేశారు. అయితే ఆ విధానంలోనూ రిజర్వేషన్లను పాటిస్తూ ఎన్డీయే సర్కారు ఆదర్శవంతంగా, రాజ్యాంగబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు.

## నా మాటలు గుర్తుపెట్టుకో చీఫ్ మినిస్టర్.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ వార్నింగ్

బాబాసాహెబ్ అంబేడ్కర్ సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తామని విమర్శించారు. నా మాటలు గుర్తుపెట్టుకో చీఫ్ మినిస్టర్ అని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. నీలాంటి ఢిల్లీ గులాములు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, తెలంగాణ ఖ్యాతిని అర్థం చేసుకోలేరని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. చిన్న పిల్లల ముందు చెత్త మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి నైజం, వ్యక్తిత్వం ఆయన పెంపకాన్ని సూచిస్తుందని అన్నారు. మానసిక రుగ్మత నుంచి రేవంత్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పరిస్థితులు ఎలా ఉన్నాయో వివరించేందుకు ఇవే తార్కాణాలు అని ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండు ఫొటోలను కూడా ఆయన షేర్ చేశారు. నిజామాబాద్‌లో పోలీసుల వేధింపులతో విసుగుచెందిన ఓ స్వీట్ షాపు యజమాని తన దుకాణాన్ని మూసివేస్తూ ఒక బ్యానర్ పెట్టారని తెలిపారు. ఒకవైపు ఇలా నిజామాబాద్‌లో చిన్న వ్యాపారులను వేధించడంలో బిజీగా ఉంటే.. మరోవైపు వరంగల్‌లోని రద్దీ రహదారిపై నిర్వహించిన కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో ఏసీపీ పాల్గొన్నారని వెల్లడించారు. ఈ వేడుకల్లో క్రాకర్స్ కాల్చడం వల్ల అమాయకులు గాయపడ్డారని మండిపడ్డారు.

## రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామన్న కేటీఆర్‌పై రేవంత్ రెడ్డి మండిపాటు!



హైదరాబాద్: సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే... తాము అధికారంలోకి వచ్చాక దానిని తొలగిస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారం పోయినా బీఆర్ఎస్ నేతలకు ఇంకా అహంకారం తగ్గలేదని విమర్శించారు. అనవసర ఆరోపణలు చేస్తే బీఆర్ఎస్ నేతలను తెలంగాణ సమాజం బహిష్కరిస్తుందని హెచ్చరించారు. డిసెంబర్ 9 లోపు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా... సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తదితరులు పంజాగుట్టలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దేశంలో విప్లవాత్మక మార్పులకు రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారన్నారు. దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలు రాజీవ్ గాంధీ హయాంలోనే బలోపేతమయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలుగా మార్చుతామని తెలిపారు.

## కూటమి ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి




ఉదాహరణకు కూటమి ప్రభుత్వం 50 ఏళ్లకే పెన్షన్ బీసీ,ఎస్సీ,ఎస్టీ , మైనారిటీ ఎప్పటినుంచి ఎప్పటినుంచి ఇస్తారు. మహిళలకు 1500 రూపాయలు .. 18 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న మధ్య వారికి ఇస్తామని చెప్పారు అది ఎప్పటినుంచి ఇస్తారు. ఇవన్నీ పక్కన పెడితే. ప్రస్తుతానికి తల్లికి వందనం.. ఈ ఏడాది ఇవ్వకపోతే ఆర్థికంగా నెలకు 5000 నుంచి 10000 సంపాదించే తల్లిదండ్రులు ప్రైవేట్ స్కూళ్లలో చదివించే వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నది. అమ్మ ఒడి డబ్బులను స్కూల్ ఫీజు కింద జమ చేసుకునేవారు లేదా ఈ తల్లిదండ్రులు కొంత మాత్రం జమ చేస్తూ ఉండేవారు. కానీ ఇప్పుడు అది వేసేలా కనిపించడం లేదు కూటమి ప్రభుత్వం. అయితే ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లలో చదివి పిల్లలను తీసుకోనీ పొమ్మంటూ తల్లితండ్రులకు చెబుతున్నారట.లేకపోతే డబ్బులు కట్టండి అంటూ అడుగుతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అసలు తల్లికి వందనం ఇస్తారా లేదా అనే విషయం పైన కూడా క్లారిటీ ఇవ్వలేదు కూటమి ప్రభుత్వం. వచ్చే ఏడాది అని అప్పుడు చెప్పారు. ఇప్పుడు ఇలాంటి వారి పరిస్థితి ఏమవుతుంది. ఒకవేళ ఇస్తామంటే ఎప్పుడు ఇస్తారని.. సరైన ఇన్ఫర్మేషన్ ఇవ్వాలి. వచ్చే ఏడాది నుంచి అయినా ఇస్తాము అంటే అది ఎంతమంది పిల్లలకైనా ఇస్తారా లేకపోతే.. ఒక్కలకు కూడా ఇవ్వకపోతే ఎలాగా అంటూ తల్లిదండ్రులు కూడా ప్రశ్నిస్తున్నారు. దీంతో వారిని రోడ్డుకి పడేసిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు తాజాగా పెన్షన్లను తగ్గించేస్తామనే వార్తలు వినిపిస్తున్నాయి.. ఇంతకుముందు వాళ్ళు కూడా పెన్షన్లను లక్ష మందికి, 50 వేల మందికో తగ్గించాలని చూసినప్పుడు రచ్చరచ్చ చేశారు. ఇప్పుడు అనర్హులను తీసేస్తామని చెప్పి వారి మీద ఏదో ఒక ఆరోపణ చెప్పి తీసేసేలా చేస్తున్నారట. ఇది నిజమే అయితే వాస్తవానికి 85 లక్షల మంది రేషన్ కార్డు కేంద్ర ప్రభుత్వం ఒకే చెబితే కోటి 47 లక్షల మంది రేషన్ కార్డు ని అందుకున్నారట. దాదాపుగా 60 లక్షల మంది. అందరినీ అనర్హులుగా తీసేస్తారా.. క్లారిటీ అనేది కూటమి ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్నది. ఇప్పుడు ఆరోగ్యశ్రీ గురించి తాజాగా వార్తలు వినిపిస్తున్నాయి.. ఆరోగ్యశ్రీ నీ నిలిపివేయడం కూడా చాలామందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయట. విషయం పైన కూడా ఏపీ ప్రజలు అసహనంతో ఉన్నారు. ఇలా ఇవే కాకుండా రైతు భరోసా, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇతరత్రా వాటిపైన కూడా ప్రజలు కూటమిపైన చేయలేదని చాలా అసహనంతో ఉన్నారట.

## పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష...

ముఖ్యమంత్రికి తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హత నిబంధన ఎత్తివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు వెల్లడించారు. దీనిపై కేబినెట్ లో చట్ట సవరణ బిల్లు కూడా ఆమోదించినట్టు తెలిపారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు గౌరవ వేతనం పెంపు అంశం కూడా నేటి సమీక్ష సమావేశంలో చర్చకు వచ్చింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఇక, ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబుకు వివరించారు. 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం... హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వరదనీరు



హైదరాబాద్: హైదరాబాద్‌లో మరోసారి భారీ వర్షం కురుస్తోంది. మంగళవారం సాయంత్రం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బేగంపేట, పంజాగుట్ట, ఉప్పల్, బోడుప్పల్, నాగోల్, కొత్తపేట, సరూర్ నగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తోంది. పలుచోట్ల వర్షం నీరు రోడ్ల పైకి చేరడంతో ట్రాఫిక్ జామ్ అయింది. జీహెచ్ఎంసీ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి. నగరంలో భారీ వర్షం కురవడంతో హుస్సేన్ సాగర్‌లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. హుస్సేన్ సాగర్‌లో మంగళవారం మధ్యాహ్నం నాటికి నీళ్లు ఫుల్ ట్యాంక్ లెవల్‌ను దాటింది. సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ 513.41 అడుగులు కాగా, మధ్యాహ్నం సమయానికి 513.63 అడుగులకు నీరు చేరుకుంది. సాగర్‌లోకి 1850 క్యూసెక్కుల నీరు వస్తుండగా, గేట్లు ఎత్తి 2100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు

## పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ చైర్ పర్సన్ పై అవిశ్వాసం



అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు: రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ చెవుల స్వప్న పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు మెజార్టీ సభ్యుల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన పత్రాన్ని సోమవారం అందజేశారు. బిఆర్ఎస్ పార్టీ నుండి కౌన్సిలర్ గా గెలుపొందిన చెవుల స్వప్న నాటకీయ పరిణామాల నడుమ చైర్ పర్సన్ గా ఎన్నుకున్నారు. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల ముందు మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్లో చేరారు. గత కొంతకాలంగా పెద్ద అంబర్పేట మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు చైర్పర్సన్ స్వప్న పై అసంతృప్తి ఉండడంతో పార్టీలకతీతంగా టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, సిపిఐ పార్టీలకు చెందిన 17 మంది కౌన్సిలర్లు చెవుల స్వప్న పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే మున్సిపల్ చైర్ పర్సన్ పదవిని దక్కించుకునేందుకు 8వ వార్డు కౌన్సిలర్ పందుగల జయశ్రీ రాజు గత కొంతకాలంగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్న పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కౌన్సిల్లో, ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందో, వీగుతుందో మరో నాలుగు ఐదు రోజులు వేచి చూడాల్సిందే.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ డే




కల్లూరు-ప్రభాత సూర్యుడు: మండల కేంద్రంలోని స్థానిక విజయ స్టూడియో నందు ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం 185వ ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఫోటోగ్రాఫర్ల మండల అధ్యక్షులు చల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఛాయాచిత్రం అనేది ఒక కళ అని,మధురమైన జ్ఞాపకాలను ఎల్లప్పుడూ చూపించేది ఫోటోగ్రఫీ మాత్రమేననిఆయనఅన్నారు. కాలగర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేది ఫోటోగ్రఫీ అని అటువంటి ఫోటోగ్రఫీ వృత్తిలో ఉన్న మనకి జీవనోపాధి కష్టంగా ఉందని ప్రభుత్వ సహకారంతో లోన్లు అందించాలని,ఫోటోగ్రాఫర్లకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జానపాటి రోజ్ వేణు,కోశాధికారి మర్సకట్ల దేవిడ్,సీనియర్ ఫోటోగ్రాఫర్లు అబ్దుల్ హబీబ్,వెంకటేశ్వరరావు, వెంకట్,గురవయ్య,సలీం,ఇక్బాల్, రాంబాబు,వంశీ,అశోక్ రామ్ కి,టి.వెంకట్,రాంబాబు,చిన్న వెంకటేశ్వరరావు,బాబురావు, నాగేశ్వరరావు,రాకేష్,మండల ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో
## సంపూర్ణ రుణ మాఫీ సాధన కార్యాచరణ




ప్రభాత సూర్యుడు - సిద్దిపేట అర్బన్: సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో సంపూర్ణ రుణ మాఫీ సాధన కార్యాచరణ అబద్ధపు హామీలు మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంనిది అని పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. రైతులకు మేలు చేయాలని సంకల్పంతోనే రెండు లక్షల రుణమాఫీ చేయించేందుకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు రాజీనామా సవాల్ విసిరారని, దేవుళ్ళ మీద ఒట్లు వేసి పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొంది 31 వేలకు కోట్లగాను,?17,000 కోట్ల రుణమాఫీ చేసి రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి మాట్లాడడం సరికాదన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ప్రతి ఇంటికి నల్ల కలెక్షన్ తో ఆడబిడ్డలను ఆత్మ గౌరవంతో బతికేలా కాపాడిన నాయకుడు కేసీఆర్ అన్నారు. రుణమాఫీ ఎంత మంది రైతులకు అయిందో గ్రామాలకు చూస్తే తెలుస్తుందని మొత్తం రుణమాఫీ చేసేదాకా ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. 50 మంది 50 శాతం మంది రైతులకు రుణమాఫీ చేయలేదని అన్నారు. పిల్లలకు మహాలక్ష్మి పేరట ఇస్తానన్న 2500 రూపాయలు పూసే ఎత్తడం లేదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యను నిర్వహణకు కనీసం అధికారులతో సమీక్ష నిర్వహించలేదని ఎద్దేవా చేశారు రైతులు పెన్షనర్లు ప్రజలు ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పాలల్లో అభివృద్ధి కొంటుపడిందన్నారు అన్నారు. ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటను చిచ్చుపెట్టేందుకు దాడుల సంస్కృతి తినలేకరని దానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు.దాడుల వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉంటే రేపు జరగబోయే పరిణామాలకు సీఎం బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ , మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి , దేవి ప్రసాద్ , ప్రతాప్ రెడ్డి , ఎర్రోళ్ల శ్రీనివాస్ ఫారూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు...

## ఆ సమయంలో తీసుకున్న రుణాలను కచ్చితంగా మాఫీ చేస్తాం




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాక ముందు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే.. తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేసింది. ఇప్పటికే దాదాపు అందరికీ రుణాలు మాఫీ అయ్యాయి. కొందరికి మాత్రం రుణామాఫీ జరగలేదు. దాంతో.. ఆ రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తాజాగా వారికి క్లారిటీ ఇచ్చారు మంత్రి పొన్నం ప్రభాకర్ . రైతు రుణమాఫీ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్.. ఈ మేరకు మాట్లాడుతూ రైతు రుణమాఫీపై ఈ కామెంట్స్ చేశారు. రుణమాఫీపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తాము కచ్చితంగా 2018 డిసెంబర్ 12వ తేదీ నంచి 2023 డిసెంబర్ 9 లోపు రూ.2 లక్షల రుణాలు పొందిన రైతులందరికీ మాఫీ డబ్బులు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర తమ ప్రభుత్వానిదే అన్నారు. పదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ అధికారంలో ఉండి రైతులకు ఏం చేశారో చెప్పాలని ఆయన నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసినప్పటికీ 8 సీట్లు కూడా దాటలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఇక రాఖీ పండుగను రాష్ట్రంలో ఎంతో సంతోషంగా జరుపుకొన్నారని అన్నారు. ఇందులో భాగంగా ప్రయాణికులు ఆరోజు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ సదుపాయాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. ఈ పండగ రోజు ఏకంగా ఆర్టీసీకి రూ.15 కోట్ల ఆదాయం వచ్చిందని అన్నారు. ఇక సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కానీ.. ఈ విషయంపై కేటీఆర్ ఇష్టం వచ్చినట్లుగా కూలుస్తామని మాట్లాడుతున్నారనీ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు.

# లంకలో ఎన్నికల సందడి




చాన్నాళ్లుగా అందరూ ఎదురుచూస్తున్న శ్రీలంక అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. వచ్చే నెల 21న జరగబోతున్న ఎన్నికల్లో 39 మంది అభ్యర్థులు ఖరారయ్యారు. శ్రీలంక దివాలా తీసి ఎంతటి విపత్కర పరిస్థితులో చిక్కుకున్నదో అందరికీ తెలుసు. 2022లో అధ్యక్ష భవనంపై, పార్లమెంటుపై ప్రజానీకం దాడి చేయటంతో అప్పటి అధ్యక్షుడు గొటబయ రాజపక్స, ఆయన కుటుంబ పరివారం దేశం విడిచి పరారయ్యారు. అంతకు మూడేళ్ల ముందు జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో గొటబయ, ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రధానిగా ఆయన సోదరుడు మహిందా రాజపక్స తిరుగులేని మెజారిటీతో ఎన్నికయ్యారు. ఈమధ్య బంగ్లాదేశ్లో అచ్చం ఇలాంటి ఘటనలే జరిగి ప్రధాని షేక్ హసీనాకు పదవీభ్రష్టత్వం తప్పలేదు. రెండేళ్లనాటి శ్రీలంక పరిణామాలు చూశాకైనా ఆమె జాగ్రత్తగా అడుగులు వేసివుంటే ఇలా జరిగేది కాదు. శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థులుగా ఉన్నవారు తమ గతాన్ని మాత్రమే కాదు... బంగ్లాదేశ్ వర్తమానాన్ని కూడా గమనంలోకి తీసుకోవాల్సివుంటుంది. ఏవో సాకులు చెప్పి ఎన్నికలు వాయిదా వేసే సంస్కృతి శ్రీలంకలో ఏనాటి నుంచో కొనసాగు తోంది. ప్రస్తుత అధ్యక్షుడు రనిల్ విక్రమసింఘే ప్రధానిగా ఉన్నప్పుడు 2017లో ప్రొవిన్షియల్ కౌన్సిళ్ల ఎన్నికలను వాయిదా వేశారు. అప్పటికి ఏడేళ్ల నుంచి ఇదే వరస. చిత్రమేమంటే 2022లో అంతగా జనాగ్రహం చవిచూశాక కూడా దేశంలో ఎన్నాళ్ల నుంచో మూలనపడివున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిధులు లేవన్న కారణంతో విక్రమసింఘే వాయిదా వేశారు. నిజానికి అధ్యక్ష ఎన్నికలు సైతం ఈ మాదిరే 'వాయిదా' తోవన పోతాయని చాలామంది అనుకున్నారు. వెంటనే ఎన్నికలు జరపాలంటూ వివిధ వర్గాలనుంచి నిరుడు డిమాండ్ వచ్చింది. కానీ దేశం ఇంకా ఆర్థికంగా కోలుకోలేదన్న కారణాన్ని చూపి వాయిదా వేశారు. మొత్తానికి ఎన్నికల కోలాహలం మొదలైంది. రెండున్నర దశాబ్దాల తర్వాత మొదటిసారిగా రాజపక్స కుటుంబం హవా లేకుండా ఎన్నికలు జరగబోతున్నాయి. తన కుటుంబం కోల్పోయిన పరువు ప్రతిష్ఠలను పునరుద్ధరించటమే ధ్యేయంగా మాజీ ప్రధాని మహిందా రాజపక్స తనయుడు 38యేళ్ల నామల్ రాజపక్స శ్రీలంక పొదుజన పెరమున(ఎస్ఎల్పీపీ) తరపున పోటీ చేస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు రనిల్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన అయిదు దశాబ్దాలు యునైటెడ్ నేషనల్ పార్టీ (యూఎన్పీ) నాయకుడిగావున్నా స్వతంత్రుడిగా నిలబడ్డారు. గతంలో యూఎన్పీని చీల్చి సమగి జన బల వేగయ (ఎస్జేబీ) పార్టీని స్థాపించి ప్రస్తుతం పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సజిత్ ప్రేమదాస కూడా అధ్యక్ష స్థానానికి పోటీపడుతున్నారు. అయితే ఇతరుల కన్నా వామపక్ష అనుకూల నేషనల్ పీపుల్స్ పవర్ పార్టీ (ఎన్పీపీ) అధినేత అనూర కుమార దిస్సానాయకే విజయావకాశాలు ఎక్కువని లంకలో ప్రధాన సర్వే సంస్థ ఇనిస్టిట్యూట్ ఫర్ హెల్త్ పాలసీ (ఐహెచ్పీ) చెబుతోంది. అదే నిజమైతే దేశ రాజకీయాలు కొత్త మలుపు తిరగటం ఖాయం. మొదటి నుంచీ ఎస్ఎల్పీపీ, యూఎన్పీలే ప్రధాన పక్షాలుగా పోటీపడుతున్నాయి. కానీ 2020 పార్లమెంటు ఎన్నికలకు ముందు సజిత్ ప్రేమదాస నిష్క్రమించాక ఆ పార్టీ దయనీయ స్థితిలో పడిపోయింది. ఆ ఎన్నికల్లో యూఎన్పీకి దక్కింది కేవలం ఒక్క స్థానం మాత్రమే. దశాబ్దాలుగా అనుసరించిన విధానాల వల్ల దేశం ఆర్థికంగా చాలా గడ్డు స్థితిలో పడిందన్నది వాస్తవం. ముఖ్యంగా రాజపక్స సోదరుల హయాంలో తమిళ టైగర్లను అణిచేయటానికి సాయం చేసిన దగ్గర్నుంచి చైనా పలుకుబడి విస్తరించింది. ఆ తర్వాత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థికసాయం అందించే నెపంతో అది భారీయెత్తున అప్పులిచ్చింది. క్రికెట్ స్టేడియం, విమానాశ్రయం, హంబన్తోటా నౌకాశ్రయం వంటివన్నీ చైనా నిర్మాణరంగ నిపుణుల నేతృత్వంలో కళ్లు చెదిరే రీతిలో నిర్మించారు. కానీ వీటి బకాయిలు తీర్చడానికొచ్చేసరికి అంతా తారుమారైంది. చివరకు హంబన్తోటాలో అనుకున్న రీతిలో కార్యకలాపాలు పుంజుకోకపోవటంతో దాన్ని చైనాకే 99 యేళ్ల లీజుకు ఇవ్వాల్సివచ్చింది. దేశాన్ని చైనాకు తాకట్టు పెడుతున్నారని విపక్షాలు చేసిన ఆరోపణలన్నీ రాజపక్స సోదరులు తీసుకొచ్చిన మెజారిటీవాదం, దేశభద్రత వగైరా అంశాలతో కొట్టుకు పోయాయి. కానీ మూడేళ్లకే ప్రజలకు తత్వం బోధపడి తిరుగుబాటు చేశారు. 2022లో దేశం దివాలా తీశాక అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) దాదాపు 300 కోట్ల డాలర్ల రుణం ఇచ్చింది. అయితే ఆర్థిక రంగంలో పెనుమార్పులు తీసుకురావాలన్న షరతు విధించింది. వ్యవస్థాగత సర్దు బాట్ల పేరుతో ఆ ప్రక్రియ ప్రస్తుతం అమలవుతోంది కూడా. కనుక ఎన్నికల అనంతరం విజేత ఎవ రైనా ఈ ప్రక్రియను కొనసాగించాల్సిందే. ప్రస్తుత అభ్యర్థుల్లో ఎన్పీపీ అధినేత అనూర కుమార దిస్సానాయకే ఒక్కరే అవినీతి మరక అంటని నేత. కావడానికి వామపక్ష అనుకూల సంస్థే అయినా సింహళ జాతీయవాదాన్ని ప్రవచించే జనతా విముక్తి పెరుమున రాజకీయ విభాగమే ఎన్పీపీ. ఒకపక్క తన పూర్వపు ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని చూసే చైనా... మొదటి నుంచీ లంకకు అన్ని విధాలా తోడ్పడుతున్న భారత్ ఈ ఎన్నికల సరళిని జాగ్రత్తగా గమనిస్తున్నాయి. ఇప్పటికే బంగ్లాలో భారత్ అనుకూల నేత హసీనా పదవి కోల్పోయారు. ఇదే అదనుగా లంకలో మళ్లీ తన హవా కొనసాగించాలని చైనా చూస్తోంది. అయితే చైనా వల్లే అప్పుల ఊబిలో కూరుకుని నిండా మునిగిన లంకలో అదంత సులభం కాదు. ఏదేమైనా జనామోదంతో ఏర్పడే ప్రభుత్వం వల్లే శ్రీలంక ప్రస్తుత కష్టాలు తీరతాయి.

# బీసీ గురుకుల సొసైటీలో అతిథి బోధకులకు అన్యాయం!



రాష్ట్రం ఏర్పడిన తర్వాత బడుగు వర్గాల పేదలకు విద్యను అందించేందుకు ప్రభుత్వం బీసీలకు 327, ఎస్సీలకు 268, ఎస్టీలకు 188, మైనార్టీలకు 205, జనరల్ కేటగిరీకి 35... ఇలా మొత్తం 1022 గురుకులాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. వీటి నిర్వహణలో ఎన్నో సమస్యలు ఉన్నవి. ముఖ్యంగా అతిథి బోధకుల టర్మినేషన్ సమస్య ప్రధానంగా మారింది. రెగ్యులర్ నియామకాలకు మంగళం పాడిన పాలకులు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ను కాదని, కారు చౌక వేతనాలతో విధులను నిర్వహిస్తారన్న ఉద్దేశంతో గంటల ప్రకారంగా అతిథి బోధకులను నియమించారు. వీరు ఐదు వేల మందికి పైగా ఉన్నారు. తమ శ్రమను, శక్తిని కూడగట్టి అహర్నిశలు శ్రమించి గురుకులాల అభివృద్ధికి ఆలంబనగా నిలిచారు. వీరికి 3 నుంచి 10ఏళ్ళకు పైగా సీనియారిటీ ఉంది. సీనియారిటీ లేని పేరుతో నిబద్ధత గలవారిని మహాత్మ జ్యోతిబా బీసీ గురుకుల సొసైటీ యాజమాన్యం తొలగిస్తున్నది. ఇందులో గెస్ట్ల శ్రమకు తగ్గ జీతాలు పెంచాలని, పన్నెండు నెలల వేతనాలు ఇవ్వాలని, సీనియారిటీలను రెగ్యులర్ చేయాలనే డిమాండ్ను పక్కదారి మల్లించే కుట్ర ఉంది. సొసైటీ సెక్రెటరీ నుంచి వెలువడిన పలురకాల ఉత్తర్వుల ప్రకారం సీనియార్టీని పరిగణనలోకి తీసుకొని, ఏ పోస్టుకు ఏ స్కూలుకు ఎవరు రెగ్యులర్ బోధకులు వస్తే ఆ సంస్థలో గెస్ట్ ఫ్యాకల్టీ చివరలో ఉన్నారో వారిని జూనియర్గా భావించి టర్మినేట్ చేయాలి, కానీ అలా చేయడం లేదు. పాఠశాల స్థాయికి పీజీ అభ్యర్థులను నియమించుకొని బీఈడీ ఉన్నవారిని తొలగిస్తున్నారు. కొన్ని చోట్ల పాఠశాల బోధకులను కాదని జూనియర్ కళాశాల బోధకులను, వివిధ పోటీ పరీక్షల శిక్షణ కోసం మధ్యలోనే విధులను మానేసి తిరిగి అదే పాఠశాలలో చేరిన వారిని, ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడకు (ఉపాధే ప్రయారిటీగా) వెళ్ళినవారిని, మరో నిరుద్యోగికి ఉపాధి కల్పిస్తున్న క్రమంలో డిప్యూటేషన్ ఇచ్చిన వారిని, వివిధ పోటీ పరీక్షలకు వయసురీత్యా పోటీపడలేని వారిని... ఇలా అనేక రకాలుగా ఉన్నవారిని స్టేషన్లో జూనియర్గా గుర్తించి టర్మినేట్ చేస్తున్నారు. ఈ విషయమై సీనియర్ గెస్టులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఎంజెపిటిబిసి గురుకుల సొసైటీ సెక్రెటరీ, ఆయా జిల్లాల కలెక్టర్లను సంప్రదించారు. సొసైటీ నిర్వాహకులకు టర్మినేషన్లను మొదలుపెట్టినప్పుడు అర్థం కాలేదు గానీ, రోజులు గడిచిన క్రమంలో సీనియార్టీలను ప్రామాణికంగా తీసుకోవాలని వచ్చిన వినతులతో అర్థం అయ్యింది. పైవారు ఇచ్చిన ఉత్తర్వులని రీజినల్ కో-ఆర్డినేటర్ (ఆర్సిఓ)లు, ప్రిన్సిపల్లు ఖాతరు చెయ్యలేదు. ఈ ప్రిన్సిపల్స్, ఆర్సిఓలు ఒకప్పుడు రెగ్యులర్ బోధకులే. రెగ్యులర్ బోధకుల డే, నైట్, స్టడీ అవర్లలో డ్యూటీలు చేస్తామన్న కొద్దిమందినీ, పలు సార్లు టర్మినేటైన వారిని బంధు ప్రీతితోనో, తమ కులం లేదా వర్ణం అన్న కారణంగానో, లేదా మతం అన్న కారణంగానో గెస్ట్ ఫ్యాకల్టీగా రిక్రూట్మెంట్ చేసుకున్నారు. ఈ అంశంలో ఇలా చాలా అంశాలు ఇమిడి ఉన్నందున గెస్టు ఫ్యాకల్టీల విషయంలో ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల సోసైటీలో ఏ విధంగా నిర్వహించారో అదేవిధంగా బీసీ గురుకుల సోసైటీలో కూడా శాస్త్రీయ విధానాన్ని ఎంచుకుని నిర్వహించాలి. అంతర్జాతీయ విద్యా వ్యవస్థలలో రిక్రూట్మెంట్ 1:18 నిష్పత్తి ప్రకారం జరగాలి. లేదా భారతదేశ విద్య వ్యవస్థలో సంస్కరణలు కావాలని నివేధించిన కొఠారి కమిషన్ ప్రకారం 1:30 లేదా 35 ప్రకారమైనా జరగాలి. వాటికి భిన్నంగా 1:50గా మారిపోయిన పరిస్థితిని ప్రస్తుతం గురుకుల విద్యా సంస్థలలో చూస్తున్నాం. దీని ప్రకారం రెగ్యులర్ నియామకాలతో పాటు గెస్ట్ ఫ్యాకల్టీల అవసరమూ ఏర్పడుతుంది. కావున రెగ్యులర్ నియామకాలతో పాటు వివిధ రకాల గెస్ట్ ఫ్యాకల్టీల ద్వారా, ఇందులో సొసైటీ సీనియారిటీ, సక్రమవిధులు, బోధనలో సామాజిక బాధ్యత, తదితరమైనవి ప్రయారిటీగా వెయిటేజ్ ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి, మంత్రివర్గం, క్లుప్తంగా ప్రజాప్రతినిధులంతా చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

# సులభ వ్యాపార విధానాలకు కార్మికులే సమిధలు!



సులభ వ్యాపార విధాన భావనకు పురుడు పోసి, పెంచి పోషించినది ప్రపంచ బ్యాంక్. మొదటగా 2002లో 'వ్యాపారం చేయడం' నివేదిక ద్వారా ఈ విధానాలకు పునాది వేసింది. వ్యాపార ప్రారంభం, నిర్మాణాల అనుమతులూ, విద్యుత్ లభ్యతా, ఋణ పరపతీ, పన్నులూ తదితర వర్తక విధానాలు సులువుగా, ప్రోత్సాహకంగా ఉన్నాయా లేదా అన్నవి సులభ వ్యాపారానికి ముఖ్యం. వివిధ దేశాలు వాటి సులభ వ్యాపార విధానాలకు రూపమిచ్చాయి. ప్రపంచ బ్యాంకు వాటిని బేరీజు వేసి ఒక సులభ వ్యాపార సూచీలోకి కుదించి ఏటా దేశాల శ్రేణిని ప్రకటిస్తూ వచ్చింది. మెరుగైన సూచీతో పెట్టుబడులకు అనువుగా ఉండేందుకు భారత్ లాంటి దేశాలు పర్యావరణ, భద్రతా చట్టాలను కూడా సులభ వ్యాపార విధానాల పరిధిలోకి తెచ్చాయి. సులభ వ్యాపార విధానాన్ని అమలు చేస్తున్న తెలుగు రాష్ట్రాలలో తరచూ పారిశ్రామిక ప్రమాదాలు జరిగి, ఏటా వందల ప్రాణాలు పోతున్నాయి. వాటిని అరికట్టడానికి నిజాయితీగా జరుగుతున్న ప్రయత్నాలు శూన్యం. ప్రమాదం జరగగానే హడావుడి. అంతే. తరువాత షరా మామూలే. సులభ వ్యాపార విధానాలని సమర్థవంతంగా అమలుపరుస్తున్న సింగపూర్, జర్మనీ, స్వీడన్లలో, ప్రతి లక్షమంది కార్మికులకీ పారిశ్రామిక ప్రమాద మరణాలు సగటున ఒకటి కంటే తక్కువ. అవి రమారమి జపాన్లో 2, తెలంగాణలో 6 (ఒక పత్రికలో వార్త ఆధారంగా కట్టిన లెక్క). నిజానికి తెలంగాణలో మరణాలు కొన్ని రెట్లు ఉండే అవకాశం వుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) ప్రపంచ దేశాల పనిలో ప్రమాద గణాంకాలు సేకరించి నివేదికలు విడుదల చేస్తుంది. ఆ నివేదికలలో భారత గణాంకాలు లేవు. భారత్ పనిలో భద్రత విషయంలో 52 అంతర్జాతీయ ఒడంబడికలపై సంతకం చేయలేదు. పైగా బలహీనమైన, అసమగ్రమైన పర్యావరణ చట్టాలను ఇంకా బలహీనపరచి దానిని సులభ వ్యాపారానికి ప్రోత్సాహకంగా భావిస్తున్నారు. కోవిడ్ కాలంలో రెడ్ కాటగిరీ మందుల పరిశ్రమలనూ, తరువాత ఇథనాల్ ఇంధన పరిశ్రమలనూ పర్యావరణంపై స్వల్ప ప్రభావం చూపే పరిశ్రమల కేటగిరీలోకి మార్చారు. వాటికి పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక సమర్పించి ప్రజాభిప్రాయ సేకరణ చేయవలసిన నిబంధనను తొలగించారు. తెలుగు రాష్ట్రాలలో మార్చిన నిబంధన పరిధిలో వందల సంఖ్యలో మందుల పరిశ్రమలకు అనుమతులిచ్చారు. కంపెనీలు నిర్మాణం చేపట్టినపుడు ప్రజలు తిరగబడ్డారు. గట్టుప్పల్లో ప్రజలు ఉద్యమించి వ్యతిరేకించిన కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణ జరపలేకపోయింది. అదే పరిశ్రమ నూతన విధానంలో అనుమతి తెచ్చుకుని నిర్మాణం చేయడానికి ఉపక్రమించగానే ప్రజలు మళ్ళీ తిరగబడ్డారు. అలాగే మునుగోడు, తురకల ఖానాపూర్, ఇంకా ఎన్నో గ్రామాలలోనూ అడ్డ తోవలో ఇచ్చిన అనుమతులను ప్రజలు తిరస్కరించారు. ఇథనాల్ పరిశ్రమలకు నీటి వనరులు భారీగా కావాలి. నిజంగా ఎంత నీరు వాడుతున్నారన్న అధ్యయనం లేదు. ఆంధ్రాలోని ఒక ఇథనాల్ కంపెనీ నీటి వనరులు చాలక విస్తరణను తెలంగాణకు మార్చుకుంది. తెలంగాణలో ఒక కంపెనీ అనుమతి కంటే దాదాపు మూడు రెట్లు నీరు వాడినట్లు ప్రజల ఫిర్యాదులతో బయటపడింది. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సింగపూర్ని ఆదర్శంగా ప్రకటిస్తుంటాయి. కాని అక్కడి పాలనా ప్రమాణాలను పట్టించుకోవు. అక్కడ పనిలో భద్రత పాటించని బాధ్యులైన వారికి జైలు శిక్షలు వేస్తారు. ఒక రవాణా కంపెనీ డైరెక్టర్ శిక్షణ లేకుండా ఎక్స్కవేటర్ వాడి ఒక కార్మికుడి మరణానికి కారణమైనందున అతనికి 5 నెలల 2 వారాల జైలు శిక్ష వేశారు. నవంబర్ 2014లో, హ్యూస్టన్ నగర పరిసరాల్లోని లాపోర్ట్లో మిథైల్ మెర్కాప్టాన్ అనే అత్యంత విషపూరితమైన, మండే వాయువును సుమారు 24,000 పౌండ్లు గాలిలోకి విడుదల చేసింది డ్యూపాంట్ సంస్థ. అది నలుగురు కార్మికులను చంపడంతో పాటు, ఇతర డ్యూపాంట్ ఉద్యోగులనూ గాయపరిచింది. ఇంకా చుట్టుపక్కల ప్రాంతాలకూ విస్తరించడంతో మరికొంతమంది ప్రజలు గాయపడ్డారు. డ్యూపాంట్ నేరాన్ని అంగీకరించడంతో మొత్తంగా కోటీ, 90 లక్షల డాలర్ల జరిమానా విధించి దానిలోని 40 లక్షల డాలర్లతో ఆ ప్రాంతాన్ని జరిగిన పర్యావరణ హాని నుండి పునరుద్ధరించాలని కోర్టు ఆదేశించింది. ఆస్ట్రేలియాలో 2023లో పనిలో భద్రతా ఆరోగ్యం చట్టాన్ని కార్మికుల మరణాలను హత్యా నేరంగా పరిగణించి 20 సంవత్సరాల వరకూ జైలు శిక్ష, కోటీ 80 లక్షల డాలర్ల వరకూ జరిమానా విధించేలా సవరించారు. మన దేశంలో సులభ వ్యాపార సంస్కరణల కోసం నియంత్రణ సంస్థలను దిష్టి బొమ్మలుగా మార్చారు. అవి ప్రజల సొమ్ముతో నడుస్తున్నా ప్రజల కోసం పనిచేయవు. పర్యావరణ, ప్రజారోగ్య, కార్మికుల ఆరోగ్య ప్రాణ రక్షణలకు గాక వ్యాపార ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా పని చేస్తాయి. అలా వాటిని మార్చారు. వృత్తిపరమైన సవాళ్ళను ఎదుర్కొని వాటికి పరిష్కారాలు కనుగొనే అవసరం, సంస్కృతీ ఆ సంస్థలలో లేక ఉద్యోగ ధర్మానికి తగ్గ నైపుణ్యం ఎదగడం లేదు. ఉదాహరణకి పర్యావరణ మంత్రిత్వ శాఖా, కాలుష్యనియంత్రణ మండలీ జవాబు దారీ లేని నిపుణుల కమిటీల పేరుతో అనుమతి నిర్ణయాలు తీసుకుంటాయి. ఆ కమిటీలకు స్వతంత్ర ప్రతిపత్తి లేదు. కమిటీలలో నిజమైన నిపుణులూ అరుదు. ఇక ఫాక్టరీ విభాగాన్ని చూస్తే, ప్రధానంగా ప్రమాదాలు రసాయన కంపెనీలలో జరుగుతున్నా సంబంధిత నైపుణ్యమున్న అధికారులు కరవయ్యారు. ప్రమాద నివారణ చర్యలు కనపడవు. ప్రమాదం జరిగిన తరువాత ప్రజలకు వివరించడం చేయరు. పత్రికలలో ఊహాగానాలు వస్తుంటాయి. సరైన ప్రమాద దర్యాప్తు సామర్థ్యం లేదు. అదే ప్రమాదాలు మళ్ళీ మళ్ళీ జరుగుతున్నాయి. జులై 2020లో విశాఖ సాల్వెంట్స్లో జరిగిన ప్రమాదమే సాహితి ఫార్మాలో జూన్ 2023లో జరిగింది. ఏలూరు జిల్లా అక్కిరెడ్డి గూడెంలో జరిగిన పోరస్ లాబ్స్ పేలుడు ప్రమాదంలో పదిమంది చనిపోయారు. దర్యాప్తులో జాతీయ హరిత ట్రిబ్యూనల్కి తప్పుడు కారణాలు చూపారు. ఆ రియాక్టర్లో రసాయన చర్య జరిగేటప్పుడు ఉత్పన్నమయ్యే ఉష్ణాన్ని తొలగించడానికి చల్లబరచే వ్యవస్థ లేదు. అది సరి చేయకుండా అశాస్త్రీయ పద్ధతులలో ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. భద్రత పట్ల కంపెనీల అలక్ష్యానికి నియంత్రణ సంస్థల నిర్వహణా లోపాలు తోడై సహేతుక మార్పులు జరగడమే లేదు. అదే తప్పు ఎస్బి ఆర్గానిక్స్, చందాపూర్లో జరిగింది. చల్లబరిచే వ్యవస్థ లేక ఉష్ణోగ్రత పెరిగి రియాక్టర్ పేలిపోయింది. ఆరుగురు చనిపోయారు. పంతొమ్మిదిమంది గాయపడ్డారు. ఏళ్లుగా ఫాక్టరీ అధికారులూ, కాలుష్య నియంత్రణ అధికారులూ చేసిన తనిఖీలలో ఆ తప్పులు గుర్తించలేదు. పైగా ఆ ప్రాంత ఫాక్టరీ అధికారి కంపెనీలను వెనకేసుకొస్తూ రియాక్టర్ లాటి కీలక పరికరాలపై ఎట్టి పరిస్థితులలోనూ శిక్షణ లేని కార్మికులను కంపెనీలు పెట్టవని పత్రికలకు సెలవిచ్చారు. ఈ ప్రమాదంపై విచారణ చేసిన మాకు ఆ కంపెనీలో జరుగుతున్న ఉత్పత్తిపై కనీస అవగాహన గల ఉద్యోగి కనపడలేదు. భారత రాజ్యాంగం ప్రకారం జీవించే హక్కు అనేది ప్రాథమిక హక్కు. పొట్టకూటి కోసం ప్రమాదకర రసాయన కంపెనీలలో కార్మికులూ, ఉద్యోగులూ ప్రాణాలు కోల్పోతున్నారు. సులభ వ్యాపార విధానాలు కార్మికుల జీవించే హక్కుని పణంగా పెడుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలూ, విద్యావంతులూ ప్రజలలో పర్యావరణ పరిరక్షణ, పనిలో భద్రతకు సంబంధించిన స్పృహని పెంచడానికి కృషి చెయ్యాలి.

## రియా చక్రవర్తి..

# ఆ గ్లామర్ డోస్ అస్సలు తగ్గలే రియా చక్రవర్తి...



ఈ పేరు 2020-2022 మధ్యకాలంలో చాలా పాపులర్ అయ్యింది. ఈ బ్యూటీ టీవీ హోస్ట్ గా కెరియర్ స్టార్ట్ చేసి తరువాత మోడలింగ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆపై నటిగా మారింది. తూనీగ తూనీగ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. అయితే ఈ మూవీ ఆశించిన స్థాయిలో మెప్పించలేదు. బాలీవుడ్ లో కూడా తొందరగానే ఎంట్రీ ఇచ్చి మేరే డాడ్ కి మారుతి సినిమాతో తన లక్కుని టెస్ట్ చేసుకుంది. అనంతరం అడపాదడపా కొన్ని చిన్న సినిమాలు చేసుకుంటూ వచ్చింది. 2018లో వరుణ్ మిత్రాతో రియా చక్రవర్తి జిలేబి అనే మూవీ చేసింది. అదేమీ అంతగా హిట్ కాలేదు. అయితే ఆ మధ్య సుశాంత్ సింగ్ రాజ్ పుత్ ఆత్మహత్య కేసులో రియా చక్రవర్తి మీద తీవ్ర ఆరోపణలు వచ్చాయి. రియా చక్రవర్తి పోలీసు విచారణ కూడా ఎదుర్కొంది. అదే సమయంలో డ్రగ్స్ కేసులో కూడా ఆమె అరెస్ట్ అయ్యింది. చాలా కాలం జైల్లో ఉన్న తర్వాత రియా చక్రవర్తి బయటకొచ్చింది. 2021లో రియా చక్రవర్తి చివరిగా చెహరే అనే సినిమాలో నటించింది. ఈ మూవీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. జైలు నుంచి బయటకొచ్చాక మూవీ ఆఫర్స్ కోసం రియా చక్రవర్తి సీరియస్ గా ట్రై చేసింది. అయితే ఆ మెకి అవకాశాలు మాత్రం రాలేదు. దీంతో రియా చక్ర వర్తి నటిగా తన కెరియర్ ని ముగించేసింది. రియా చక్రవర్తి ఎంటీవీ షోలో హోస్ట్ గా కెరియర్ స్టార్ట్ చేసింది. హీరోయిన్ గా ఎంట్రీకి ముందు వరకు డిఫరెంట్ షోలకి హోస్ట్ గా చేసింది.

%ూశ్రీంశీ =ఝం% -

ఆమె కంటే అతడు 10 ఏళ్లు చిన్న.. పుకార్లపై క్లారిటీ


నటిగా అడుగుపెట్టిన తర్వాత హోస్టింగ్ కి ముగింపు కార్డు పెట్టింది. నటిగా కూడా ఇప్పుడు రియా చక్రవర్తి కెరియర్ ని ముగించేసింది. కొత్తగా యుట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేసి వీడియో పాడ్ కాస్ట్ లు చేస్తోంది. హోస్ట్ గా ఉన్న అనుభవంతో వీడియో పాడ్ కాస్టర్ గా రాణించే ప్రయత్నంలో ఉంది. తాజాగా ఈ అమ్మడు ఇన్ స్టాగ్రామ్ లో ఫోటో షేర్ చేసింది. ఈ ఫోటోలో లాంగ్ టీ షర్ట్ ధరించి దానిపై షార్టు వేసుకొని సోఫాలో కూర్చొని కనిపిస్తోంది. ఈ ఫోటోకి చాప్టర్ 2 అని పోస్ట్ పెట్టింది. రియా చక్రవర్తి చాప్టర్ 1 పాడ్ కాస్ట్ వీడియోని సుస్మిత సేన్ తో చేసింది. ఇప్పుడు చాప్టర్ 2 పాడ్ కాస్ట్ వీడియోని రిలీజ్ చేయబోతున్నట్లు ఈ ఫోటోతో రివీల్ చేసింది. ఈ పిక్స్ తో రియా చక్మరస్ గారవర్తి చాలా గ్లా ఉందని ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. అలాగే కొత్త జర్నీకి కం గ్రాట్స్చెబుతున్నారు.

# ఈగల్ బ్యూటీ గ్లామర్ డోస్ పెంచిందా..!




ఈ మాయ పేరేమిటో సినిమాతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ కావ్య థాపర్. మొదటి సినిమా తో పెద్దగా గుర్తింపు రాకున్నా కూడా ప్రయత్నాలు ఆపలేదు. తమిళంలో ఈమె సినిమాలు వరుసగా చేస్తూ వచ్చింది. తెలుగు లో మరోసారి కావ్య థాపర్ కి ఏక్ మినీ కథ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడం ద్వారా ఇండస్ట్రీ గుర్తింపు దక్కించుకుంది. అయితే ఆ సినిమా ఓటీటీ సినిమా అవ్వడం వల్ల రావాల్సిన ఆఫర్లు ఈ అమ్మడికి రాలేదు అనేది సినీ విశ్లేషకులు మరియు ఆమె సన్నిహితుల మాట. రవితేజ కు జోడీగా ఈగల్ సినిమాలో నటించే అవకాశంను ఈ అమ్మడు దక్కించుకుంది. తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో పెద్ద హీరోతో నటించింది అనుకుంటున్న సమయంలోనే ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో కాస్త నిరుత్సాహం కు గురి అయ్యింది. ఆ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఆఫర్లు వస్తాయో లేదో అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో డబుల్ ఇస్మార్ట్ సినిమాలో రామ్ కు జోడీగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న డబుల్ ఇస్మార్ట్ సినిమాపై కావ్య థాపర్ ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తోంది. మిడిల్ క్లాస్ లవ్ చిత్రంతో హిందీలో అడుగు పెట్టిన ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో విజయం దక్కలేదు. కానీ తమిళంలో మాత్రం ఈ అమ్మడు పిచ్చైక్కారన్ 2 సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుని అక్కడ వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటుంది. టాలీవుడ్ మరియు కోలీవుడ్ లో సమాంతరంగా సినిమాలు చేస్తున్న కావ్య థాపర్ కి ముందు ముందు భారీ ఆఫర్లు తలుపు తట్టే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈమె డబుల్ ఇస్మార్ట్ ఫలితం పైనే అంతా ఆధారపడి ఉంటుంది అనే అభిప్రాయం ను నెటిజన్స్ వ్యక్తం చేస్తున్నారు. సినిమాల ఫలితం తో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేయడం ద్వారా తన ఫాలోవర్స్ సంఖ్య ను భారీగా పెంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలను చూస్తే కావ్యా థాపర్ ఈ మధ్య కాలంలో గ్లామర్ డోస్ పెంచిందే అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. వైట్ షర్ట్ ధరించి పై బటన్స్ ను తొలగించి, కవ్వించే చూపులతో నెటిజన్స్ చూపు తిప్పుకోనివ్వని అందం కావ్య థాపర్ అందం అనిపిస్తుంది. ఈ స్థాయి లో అందంగా ఉన్న కావ్య థాపర్ కి మరిన్ని సినిమాల్లో ఆఫర్లు రావాలి, స్టార్ హీరోయిన్ పీస్ అంటూ నెటిజన్స్ ఈ ఫోటోలకు తెగ కామెంట్స్ చేస్తున్నారు.





# పూజా హెగ్డే.. సగం చొక్కాలో వయ్యారంగా..



సినీ ప్రపంచంలో స్టార్ హీరోయిన్స్ నిత్యం కొత్తగా స్టిల్స్ ఇస్తూ, స్టైలిష్ లుక్స్ తో అభిమానులను ఆకట్టుకుంటారు. అందులో పూజా హెగ్డే కూడా ఒకరు. 'ముకుంద'తో తెలుగు తెరకు పరిచయమైన ఈ బ్యూటీ, 'దువ్వాడ జగన్నాథం'తో పాటు పలు భారీ చిత్రాల్లో నటించి, స్టార్ హీరోయిన్గా మొన్నటివరకు బాగానే కొ నసాగింది. అయితే, ఇటీవల బాలీవుడ్ లో తన సత్తా చాటాలని ప్రయత్నించినా, 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' వంటి భారీ ప్రాజెక్ట్లు నిరాశపరచడంతో, పూజకు కొన్ని అనుకున్న అవకాశాలు చేజారి పోయాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా 'రాధే శ్యామ్' మరియు 'ఆచార్య' వంటి చిత్రాలు నిరాశ పరిచాయి. అయితే, తన కెరీర్ లో వచ్చిన ఈ ఆటుపోట్లను పూజా ఒత్తిడిగా మార్చుకోకుండా, కొత్త ప్రాజెక్టల కోసం ప్రయత్నిస్తోంది. ఐఫిల్ అందం ముందు అందాల దక్షా ఇదిలా ఉండగా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ టాపిక్ గా మారింది. తన ఇన్స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా పూజా నిత్యం అభి మానులతో టచ్లో ఉంటూ, ట్రెడిషనల్ లుక్స్ తో పాటు, మోడ్రన్ అవుట్ఫిట్స్లో స్టన్నింగ్ ఫోటోలను పోస్ట్ చేస్తూ, ఎప్పటికప్పుడు ట్రెండింగ్లో నిలుస్తోంది. తాజాగా పూజా హెగ్డే తన ఇన్స్టాగ్రామ్ లో చిరిగినట్లు ఉన్న ఒక చొక్కాతో పోజులు ఇచ్చింది. డిఫరెంట్ గా ఉన్న ఆ ఫోటోలు షేర్ చేయగా, అభిమానులు ఆమె లుక్పై మంత్ర ముగ్దులైపోయారు. వయ్యారంగా నిలబడడంతో ఆమె అందాన్ని మరింత పెంచేసింది. పూజా హెగ్డేని ఈ ఈ స్టైలిష్ లుక్ లో చూసి, నెటిజన్లు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఇక ఈ బ్యూటీ సినిమాల విషయానికి వస్తే చివరగా తెలుగులో అయితే ఆచార్య సినిమాలో కనిపించింది. ఆ తర్వాత అనిల్ రావిపూడి ఎఫ్-3 సినిమాలో స్పెషల్ సాం గుర్తింపు గ్ చేసినప్పటికీ కూడా ఆపై %నటిగా మారింపెద్దగా రాలేదు. ఇక ప్రస్తుతం తమిళంలో సూర్యతో ఒక సినిమా చేస్తోంది. కార్తీక్ సుబ్బరాజ్ ఆ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. అలాగే బాలీవుడ్లో షాహిద్ కపూర్ తో కూడా ఒక సినిమా చేస్తోంది. మరి ఈ రెండు సినిమాలు అమ్మడికి ఎలాంటి ఫలితాన్ని అందిస్తాయో చూడాలి.



# రన్ రాజా రన్ అందం చూశారా...!



2014లో రన్ రాజా రన్ సినిమాలో శర్వానంద్ కు జోడీగా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ సీరత్ కపూర్. ఈ అమ్మడు ఆ తర్వాత తెలుగు లో పలు సినిమాల్లో నటించింది. మొదటి సినిమాతోనే హిట్ ను సొంతం చేసుకోవడం వల్ల దశాబ్ద కాలం అయినా కూడా ఈ అమ్మడి సొంతం కంటిన్యూ అవుతోంది. చేసిన సినిమాలు కొన్ని అయినా కూడా ప్రతి సినిమా తో అలరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్న ఈ అమ్మడు తెలుగు తో పాటు హిందీ సినిమాల్లో కూడా అప్పుడప్పుడు నటిస్తూ బిజీ బిజీ గా కెరీర్ లో కొనసాగుతున్న విషయం అందరికి తెలిసిందే. హరీష్ శంకర్ ఏమన్నారంటే.. హీరోయిన్ గా ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు ఓటీటీ సినిమాలు మరియు వెబ్ సిరీస్ ల్లో కూడా నటిస్తూ ఉంది. నటిగా ఎప్పుడూ బిజీగా ఉండాలని ఆశించే ఈ అమ్మడు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది. నటిగా ప్రస్తుతం ఈ అమ్మడు ఒక హిందీ సినిమాను చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా కి సంబంధించిన ప్రకటన త్వరలో వెల్లడి అయ్యే అవకాశం ఉందని సమాచారం అందుతోంది. సోషల్ మీడయాలో సీరత్ కపూర్ చాలా యాక్టివ్ గా ఉండి తన అందమైన ఫోటోలను మరియు వీడియోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. చేసింది. మీరు ధరించగలిగే అత్యంత స్టైలిష్ విషయం విశ్వాసం.. అంటూ ఈ ఫోటోలతో పాటు మంచి సందేశాన్ని నెటిజన్స్ కి అందించింది. ఎంతటి ఖరీదైన ఔట్ ఫిట్ ధరించినా, స్టైలిష్ ఔట్ ఫిట్ లో కనిపించినా కూడా మనలో విశ్వాసం అనేది లేకుంటే ఆ ఫోటోలకు అందం ఉండదు అంటూ సీరత్ కపూర్ చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సీరత్ కపూర్ ఫేస్ లో చాలా కాన్ఫిడెన్స్ కనిపిస్తుందని, ఆమె అదే కాన్ఫిడెన్స్ తో ముందు ముందు కొనసాగాలి అంటూ అభిమానులు మరియు నెటిజన్స్ కోరుకుంటున్నారు. ఇక సీరత్ కపూర్ కెరీర్ విషయానికి వస్తే... 2011 రాక్స్టార్ సినిమాకు సీరత్ కపూర్ అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ గా పని చేసింది. సుజీత్ దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా రూపొందిన రన్ రాజా రన్ సినిమా లో నటించడం ద్వారా హీరోయిన్ గా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. వారణాసి నేపథ్యంలో సందీప్ కిషన్ హీరోగా రూపొం గా నటించింది. నాగార్జున కీలక పాత్రలో నటించిన రాజుగారి గది 2 చిత్రందిన టైగర్ సినిమాలో హీరోయిన్లో కూడా సీరత్ కపూర్ నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. అల్లు శిరీష్ తో ఒక్క క్షణం సినిమా చేస్తోంది. సినిమాలతో పాటు పలు కమర్షియల్ బ్రాండ్స్ కి అంబాసిడర్ గా పలు యాడ్స్ లో నటించింది.



PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215